ప్రశ్నించడం కోసం...?

PRGI NO:APTEL/26/A7511

మన ప్రజాప్రతినిధి

జాతీయ తెలుగు దినపత్రిక

సంపటి : 3	సంచిక :131	విజయవాడ	సోమవారం	నవంబర్ 2 2026	పేజీలు : 4 వేల : 2/

Published From:Andrapradesh,Telangana,Vijayawada,Hyderabad.Editar:G.Srinivas,epaper.manaprajaprathinidhi.com,

లక్షల్లో జీతాలు ఆపైనే లంచాల వ్యవహారం .....

ఎన్టీఆర్ జిల్లా పడమట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో



●రిజిస్ట్రేషన్లలో అదనపు వసూళ్ల ఆరోపణలు!

●ఎన్టీఆర్ జిల్లా పడమట కళా నగర్ విజయవాడ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అసలు ఏం జరుగుతోంది?

●డాక్యుమెంట్ రైటర్ల జోక్యంపై విమర్శలు

●ఫిర్యాదులపై విచారణ ఎక్కడ? చర్యలు ఎప్పుడు?

●ప్రభుత్వ కార్యాలయంలో ప్రజలకు పారదర్శకంగా సేవలు అందించాల్సిన పడమట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ల వ్యవహారంపై పలు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

(ఆంధ్రప్రదేశ్ స్టేట్ బ్యూరో ప్రత్యేక కథనం ఎన్టీఆర్ జిల్లా కళానగర్ విజయవాడ పడమట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం)//ప్రభుత్వానికి చెల్లించాల్సిన ఫీజులు చెల్లించిన తర్వాత కూడా అదనపు మొత్తాలు చెల్లించాల్సి వస్తోందని కొందరు బాధితులు ఆరోపిస్తున్నట్లు సమాచారం.?డాక్యుమెంట్ రైటర్ల జోక్యం పెరిగిందని, రిజిస్ట్రేషన్ ప్రక్రియలో సామాన్యులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విమర్శలు వ్యక్తమవుతున్నాయి.?ఈ ఆరోపణల్లో వాస్తవాలెంత? అధికారుల పర్యవేక్షణ ఎలా ఉంది?

అన్న ప్రశ్నలు స్థానికంగా చర్చనీయాంశమవుతున్నాయి

తక్కువలో తక్కువ 20,000 ఇరవై వేల నుండి 30,000 ముప్పయి వేల వరకు వసూళ్ల ఆరోపణలు రిజిస్ట్రేషన్ ప్రక్రియలో ఒక్కో లావాదేవీకి అదనంగా వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.?వివాదాస్పద ఆస్తుల విషయంలో లక్షల రూపాయల వరకు డిమాండ్లు ఉంటున్నాయనే ప్రచారం కూడా సాగుతోంది. అయితే, ఈ మొత్తాలు ఎవరికి, ఏ సందర్భంలో చెల్లించాల్సి వస్తోంది?

అధికారిక ఫీజులకు అదనంగా వసూళ్లు జరుగుతున్నాయా?

అనే అంశాలపై ఆధారాలతో కూడిన విచారణ జరగాల్సి ఉంది.ఆ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో ప్రైవేటు వ్యక్తుల పాత్ర ఎంత?రిజిస్ట్రేషన్‌కు సంబంధించిన పత్రాల తయారీ నుంచి ఇతర ప్రక్రియల వరకు డాక్యుమెంట్ రైటర్ల ప్రభావం అధికంగా ఉంటోందనే విమర్శలు వినిపిస్తున్నాయి.!ప్రభుత్వ కార్యాలయంలో జరగాల్సిన పనుల్లో ప్రైవేటు వ్యక్తుల జోక్యం ఎంతవరకు ఉంది?నిబంధనల ప్రకారం సేవలు అందుతున్నాయా? అన్న అంశాలపై అధికారులు స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉంది.డాక్యుమెంట్ రైటర్లందరినీ తప్పుబట్టడం కాకుండా, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నవారుంటే వారిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఫిర్యాదులపై స్పందన ఏది?

ఈ వ్యవహారానికి సంబంధించి గతంలో జిల్లా రిజిస్ట్రేషన్ అధికారుల దృష్టికి అంశాలు తీసుకెళ్లినట్లు ప్రచారం జరుగుతోంది. ఆధారాలు సమర్పించాలని కోరినప్పటికీ, తదుపరి విచారణ లేదా చర్యలపై స్పష్టత లేదని కొందరు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం. ఫిర్యాదులు అందాయా?అందితే వాటిపై విచారణ చేపట్టారా? బాధ్యులుగా ఎవరినైనా గుర్తించారా? అనే విషయాలను సంబంధిత అధికారులు వెల్లడించాల్సి ఉంది.

భూముల రిజిస్ట్రేషన్లపైనా పరిశీలన అవసరమా?

రియల్ ఎస్టేట్ లావాదేవీల్లో నిబంధనల అమలుపై కూడా స్థానికంగా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి ! ముఖ్యంగా అసైన్డ్, ఇనాం, ప్రభుత్వ భూములకు సంబంధించిన రిజిస్ట్రేషన్లలో నిబంధనలు పాటిస్తున్నారా? అనే అంశాన్ని పరిశీలించాలని ప్రజలు కోరుతున్నారు. అయితే, అక్రమ రిజిస్ట్రేషన్లు జరిగినట్లు నిర్ధారించేందుకు సంబంధిత రికార్డులు, పత్రాలు, లావాదేవీలను అధికారికంగా పరిశీలించాల్సి ఉంది.

అవినీతి నిరోధక శాఖ విజిలెన్స్ అధికారులు విచారణకు డిమాండ్

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో వినిపిస్తున్న ఆరోపణలపై ఉన్నతాధికారులు స్పందించి సమగ్ర విచారణ చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.అవసరమైతే విజిలెన్స్, అవినీతి నిరోధక శాఖలు నిబంధనల ప్రకారం పరిశీలన జరపాలని డిమాండ్ చేస్తున్నారు.ఆరోపణలు నిజమని తేలితే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, ఎలాంటి అక్రమాలు జరగలేదని తేలితే ప్రజలకు వాస్తవాలను వివరించాలని కోరుతున్నారు.

ప్రజలకు అందాల్సింది పారదర్శక సేవలే!

రిజిస్ట్రేషన్ అనేది సామాన్యుల ఆస్తి హక్కులతో ముడిపడిన కీలక ప్రక్రియ. ప్రతి లావాదేవీలో అధికారిక ఫీజుల వివరాలు అందుబాటులో ఉంచడం, అనధికారిక చెల్లింపులకు తావులేకుండా చూడడం, ఫిర్యాదులపై చర్యలు తీసుకోవడం అధికారుల బాధ్యత. విజయవాడ పడమట కళానగర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంపై వస్తున్న ఆరోపణలపై సంబంధిత అధికారులు స్పందించి వాస్తవాలను వెల్లడిస్తారా? అనేది వేచి చూడాలి. అతి త్వరలో మీ ముందుకు మరో సంచలనాత్మక కథనంతో మీ మా మన ప్రజా ప్రతినిధి తెలుగు దినపత్రికలో



ప్రశ్నించడం కోసం...?

PRGI NO:APTEL/26/A7511

మన ప్రజాప్రతినిధి

జాతీయ తెలుగు దినపత్రిక

సంపటి : 3	సంచిక :131	విజయవాడ	సోమవారం	నవంబర్ 2 2026	పేజీలు : 4 వేల : 2/

Published From:Andrapradesh,Telangana,Vijayawada,Hyderabad.Editar:G.Srinivas,epaper.manaprajaprathinidhi.com,

పురిటినొప్పులతో..... గర్భిణీకి డోలీ మోత!

- మూడు కిలోమీటర్లు మోసుకెళ్లిన కుటుంబ సభ్యులు
- తొమ్మిది నెలల గర్భిణీ నీలిమకు తప్పని అవస్థలు
- రోడ్డు సదుపాయం లేక అంబులెన్సు చేరుకోలేని దుస్థితి
- గిరిజన గ్రామాల్లో రహదారులపై మరోసారి ప్రశ్నలు



అల్లూరి జిల్లా, అక్టోబర్ 31 (మనప్రజాప్రతినిధి): గిరిజన ప్రాంతాల్లో రహదారి సదుపాయాల కొరత మరోసారి వెలుగులోకి వచ్చింది. తొమ్మిది నెలల గర్భిణీకి పురిటినొప్పులు రావడంతో ఆసుపత్రికి తరలించేందుకు కుటుంబ సభ్యులు డోలీని ఆశ్రయించాల్సి వచ్చింది. అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మండలం తలారుపాడు గ్రామానికి చెందిన నీలిమ అనే గర్భిణీకి పురిటినొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. గ్రామానికి సరైన రహదారి సదుపాయం లేకపోవడంతో అంబులెన్సు నేరుగా చేరుకునే పరిస్థితి లేకుండా పోయింది. దీంతో చేసేదేమీ లేక కుటుంబ సభ్యులు ఆమెను డోలీలో కూర్చోబెట్టి సుమారు మూడు కిలోమీటర్ల దూరం మోసుకెళ్లారు. గర్భిణీకి నొప్పులు వస్తుండటంతో కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళన మధ్య ప్రయాణం సాగించారు. అనంతరం ఆసుపత్రికి తరలించి చికిత్స కోసం చేర్పించారు. ప్రసవ సమయం సమీపించిన మహిళకు అత్యవసర వైద్యం అందించాల్సిన సమయంలో ఇలాంటి పరిస్థితి ఎదురుకావడం స్థానికంగా ఆవేదన కలిగిస్తోంది.గ్రామానికి రహదారి లేకపోవడంతో అత్యవసర సమయాల్లో గిరిజన కుటుంబాలు పడుతున్న ఇబ్బందులు మరోసారి చర్చనీయాంశమయ్యాయి. సాధారణంగా అనారోగ్యం, ప్రమాదాలు, ప్రసవ సమయాల్లో బాధితులను ఆసుపత్రులకు 2

గ్రీస్ తీరానికి చేరిన ఐఎన్ఎస్ త్రిశూల్



- మధ్యధరా సముద్రంలో భారత నౌకాదళ విన్యాసాలు
- గ్రీస్‌లోని సౌదా బే నౌకాశ్రయంలో నౌక నిలుపుదల
- గ్రీస్ నౌకాదళంతో సముద్ర భద్రతా చర్చలు
- రెండు దేశాల మధ్య రక్షణ సహకారానికి మరింత బలం

2

పాట్నాలో భారీగా మద్యం పట్టివేత

- రూ.8.80 లక్షల విలువైన మద్యం స్వాధీనం
- అద్దె గదిలో 2,497 మద్యం సీసాల నిల్వ
- 733 లీటర్లకు పైగా మద్యం గుర్తింపు
- ఒకరి అరెస్ట్.. ఇతర రాష్ట్రాల నుంచి అక్రమ రవాణా



2

క్యాన్సర్ చికిత్సలో చారిత్రక ముందడుగు




- దేశంలో తొలి ప్రభుత్వ ప్రోటాన్ చికిత్స కేంద్రం
- రూ.600 కోట్లతో గువహటిలో అత్యాధునిక వైద్యశాల
- మూడేళ్లలో అందుబాటులోకి తీసుకురావాలని లక్ష్యం
- పేద, మధ్యతరగతి రోగులకు మెరుగైన వైద్యసేవలు

గువహటి, నవంబర్ 1 (మనప్రజాప్రతినిధి): క్యాన్సర్ చికిత్స రంగంలో ఈశాన్య భారతదేశం చారిత్రక ముందడుగు వేయనుంది. దేశంలోనే మొట్టమొదటి ప్రభుత్వ రంగ ప్రోటాన్ కిరణ చికిత్స కేంద్రాన్ని అస్సోం రాజధాని గువహటిలో ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇందుకోసం బెల్జియంకు చెందిన అయాన్ బీమ్ అప్లికేషన్స్ సంస్థతో రూ.600 కోట్ల విలువైన ఒప్పందాన్ని కుదుర్చుకుంది. గువహటి వైద్య కళాశాల, ఆసుపత్రి ప్రాంగణంలో ఈ అత్యాధునిక చికిత్స కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నారు. రాబోయే మూడేళ్లలో నిర్మాణం, యంత్రాల ఏర్పాటు, వైద్య సదుపాయాల అభివృద్ధి పూర్తి చేసి 2

చౌటుప్పల్‌లో దారుణ హత్య

- జోగిని రాళ్లబండి సుధాకర్ హతం
- 60 తులాల బంగారం, రూ.10 లక్షల నగదు దోపిడీ
- హత్య అనంతరం కారుతో పరారైన దుండగులు
- రంగంలోకి దిగిన పోలీసులు.. ఆధారాల సేకరణ



చౌటుప్పల్, నవంబర్ 1 (మనప్రజాప్రతినిధి): యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్‌లో అర్ధరాత్రి దారుణ హత్య వెలుగులోకి రావడం తీవ్ర కలకలం రేపింది. జోగినిగా పేరొందిన రాళ్లబండి సుధాకర్‌ను గుర్తుతెలియని దుండగులు అత్యంత కిరాతకంగా హత్య చేశారు. హత్య అనంతరం ఇంట్లో ఉన్న విలువైన బంగారు ఆభరణాలు, భారీ మొత్తంలో నగదును దోచుకెళ్లారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర భయాందోళనలకు కారణమైంది. అర్ధరాత్రి సమయంలో ఇంట్లోకి ప్రవేశించిన దుండగులు సుధాకర్‌పై దాడి చేసి హత్య చేసినట్లు ప్రాథమిక సమాచారం. అనంతరం ఇంట్లో విలువైన వస్తువుల కోసం వెతికి భారీ దోపిడీకి పాల్పడినట్లు తెలుస్తోంది. ఈ ఘటన వెనుక పక్కా ప్రణాళిక ఉందా? లేక దోపిడీ క్రమంలోనే హత్య జరిగిందా? అనే కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.దుండగులు ఇంట్లో ఉన్న సుమారు 60 తులాల బంగారాన్ని అపహరించినట్లు సమాచారం. వీటితో పాటు రూ.10 లక్షల నగదును కూడా ఎత్తుకెళ్లారు. హత్యతో పాటు ఇంత భారీ మొత్తంలో బంగారం, నగదు దోపిడీ జరగడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఇంట్లో విలువైన ఆభరణాలు, నగదు ఉన్న విషయం దుండగులకు ముందుగానే తెలుసా? అనే అంశంపై పోలీసులు ఆరా తీస్తున్నారు. సుధాకర్ ఆర్థిక లావాదేవీలు, వ్యక్తిగత పరిచయాలు, గత కొంతకాలంగా ఆయనతో సంబంధాలు కలిగిన వ్యక్తుల వివరాలను పరిశీలించే అవకాశం ఉంది. దోపిడీకి గురైన సొత్తు విలువ, వాటి వివరాలను సేకరించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు.దుండగులు సుధాకర్‌కు చెందిన కారును కూడా అపహరించుకుని వెళ్లినట్లు సమాచారం. హత్య చేసిన అనంతరం బంగారం, నగదు తీసుకుని కారులోనే అక్కడి నుంచి పరారైనట్లు తెలుస్తోంది. దీంతో పోలీసులు పరిసర ప్రాంతాల్లోని రహదారులు, అనుమానాస్పద మార్గాలపై దృష్టి సారించారు. అపహరణకు గురైన కారు ఆచూకీ గుర్తించేందుకు చర్యలు చేపడుతున్నారు. సమీప 2


నగరంలో నీటి సరఫరాకు అంతరాయం

- నవంబర్ 3 నుంచి 36 గంటలపాటు మరమ్మతులు
- గండిపేట కాండ్యూట్‌లో భారీ లీకేజీలకు అడ్డుకట్ట
- పలు డివిజన్ల పరిధిలో తాగునీటి సరఫరా నిలిపివేత
- ప్రజలు ముందస్తుగా నీటిని నిల్వ చేసుకోవాలని



3

పురిటినొప్పులతో...గర్భిణీకి డోలీ మోత!


మెదటి పేజీ తరువాయి

వేగంగా తరలించాల్సి ఉంటుంది. అయితే మారుమూల గిరిజన గ్రామాలో1 సరైన రహదారులు లేకపోవడంతో అంబులెన్సులు గ్రామాల వరకు చేరుకోలేకపోతున్నాయి. ఫలితంగా బాధితులను డోలీల్లో మోసుకెళ్లాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ముఖ్యంగా గర్భిణులు, వృద్ధులు, చిన్నపిల్లలు అత్యవసర వైద్య సేవలు పొందడంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నీలిమ విషయంలోనూ కుటుంబ సభ్యులు సుమారు మూడు కిలోమీటర్లు డోలీ మోసి ఆసుపత్రికి చేర్చాల్సి రావడం గిరిజన ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల పరిస్థితిని స్పష్టం చేస్తోంది. మరోవైపు ఏజెన్సీ ప్రాంతాల్లో వేల కిలోమీటర్ల మేర రహదారులు నిర్మించామని జనసేన నాయకులు, పార్టీ వర్గాలు ప్రచారం చేస్తున్న నేపథ్యంలో ఈ ఘటనపై గిరిజనులు ప్రశ్నలు సంధిస్తున్నారు. నిజంగా తమ గ్రామాలకు రహదారులు అందుబాటులో ఉంటే గర్భిణులను డోలీల్లో మోసుకెళ్లాల్సిన పరిస్థితి ఎందుకు వస్తోందని నిలదీస్తున్నారు. ప్రభుత్వ ప్రకటనలకు, క్షేత్రస్థాయిలో తమకు ఎదురవుతున్న ఇబ్బందులకు మధ్య వ్యత్యాసం ఉందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. గ్రామాలకు రహదారులు నిర్మించామని చెబుతున్నప్పటికీ, కొన్ని మారుమూల ప్రాంతాలకు కనీస రాకపోకల సౌకర్యం కూడా అందుబాటులో లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా వర్షాకాలంలో పరిస్థితులు మరింత దయనీయంగా మారుతున్నాయని, అత్యవసర సమయాల్లో ప్రాణాలను పణంగా పెట్టి ప్రయాణించాల్సి వస్తోందని చెబుతున్నారు.చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వంపై గిరిజనులు రహదారి సదుపాయాల విషయంలో అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నామని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ, తలారుపాడు వంటి గ్రామాల్లో కనీస రహదారి సౌకర్యం లేకపోవడం ఆందోళన కలిగిస్తోందని పేర్కొంటున్నారు. గ్రామాలకు రహదారులు నిర్మించడంతో పాటు అత్యవసర వైద్య సేవలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. గర్భిణులను ఆసుపత్రులకు తరలించేందుకు ప్రత్యేక రవాణా సదుపాయాలు కల్పించాలని, అంబులెన్సులు చేరుకోలేని ప్రాంతాల్లో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. నీలిమను డోలీలో మోసుకెళ్లిన ఘటనపై అధికారులు స్పందించి గ్రామానికి రహదారి నిర్మాణం చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.గిరిజన ప్రాంతాల అభివృద్ధిని కేవలం ప్రకటనలు, గణాంకాలకే పరిమితం చేయకుండా ప్రతి గ్రామానికి కనీస మౌలిక సదుపాయాలు అందించాల్సిన అవసరం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లలకు అత్యవసర వైద్యం అందించేందుకు రవాణా వ్యవస్థను బలోపేతం చేయాలి. మారుమూల గ్రామాలకు రహదారులు నిర్మించడం, అందుబాటులో ఉన్న మార్గాలను మెరుగుపరచడం, అత్యవసర సమయాల్లో వైద్య సిబ్బంది త్వరగా చేరుకునేలా ఏర్పాట్లు చేయడం అత్యంత కీలకం. తొమ్మిది నెలల గర్భిణీని మూడు కిలోమీటర్లు డోలీలో మోసుకెళ్లాల్సిన పరిస్థితి రావడం అభివృద్ధి కార్యక్రమాల అమలుపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. తలారుపాడు గ్రామ సమస్యను అధికారులు తక్షణమే పరిశీలించి శాశ్వత పరిష్కారం చూపాలని గిరిజనులు కోరుతున్నారు.

గ్రీస్ తీరానికి చేరిన ఐఎన్ఎస్ త్రిశూల్


మెదటి పేజీ తరువాయి

న్యూఢిల్లీ, నవంబర్ 1 (మనప్రజాప్రతినిధి): భారత నౌకాదళానికి చెందిన ఐఎన్ఎస్ త్రిశూల్ యుద్ధనౌక మధ్యధరా సముద్రంలో కొనసాగుతున్న తన పర్యటనలో భాగంగా గ్రీస్‌లోని సౌదా బే నౌకాశ్రయానికి చేరుకుంది. ఈ పర్యటన ద్వారా భారత్, గ్రీస్ దేశాల మధ్య సముద్ర భద్రత, రక్షణ రంగ సహకారాన్ని మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. భారత నౌకాదళానికి చెందిన ఈ యుద్ధనౌక రాకతో ఇరు దేశాల నౌకాదళాల మధ్య పరస్పర సంబంధాలకు మరో అవకాశం ఏర్పడింది. అంతర్జాతీయ సముద్ర మార్గాల్లో భద్రత, ప్రాంతీయ స్థిరత్వం, నౌకాదళాల మధ్య సమన్వయం వంటి అంశాల్లో పరస్పర సహకారం పెంపొందించు కోవడానికి ఈ పర్యటన దోహదపడనుంది.ఈ నౌకాశ్రయ సందర్శన సందర్భంగా ఐఎన్ఎస్ త్రిశూల్ సిబ్బంది గ్రీస్ నౌకాదళమైన హెలెనిక్ నేవీ అధికారులతో వివిధ కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. ఉన్నతాధికారులతో సమావేశాలు నిర్వహించడంతో పాటు వృత్తిపరమైన అంశాలపై చర్చలు జరపనున్నారు. సముద్ర కార్యకలాపాల నిర్వహణ, నౌకాదళ అనుభవాల మార్పిడి, సముద్ర భద్రతకు సంబంధించిన సవాళ్లు వంటి అంశాలపై ఇరు దేశాల అధికారులు అభిప్రాయాలు పంచుకోనున్నారు. ఈ సమావేశాలు రెండు దేశాల మధ్య రక్షణ సంబంధాలను మరింత విస్తరించేందుకు ఉపయోగపడతాయని రక్షణ శాఖ వెల్లడించింది.ఈ పర్యటనలో భాగంగా ఇరు దేశాల నౌకాదళ సిబ్బంది పరస్పరం యుద్ధనౌకలను సందర్శించే కార్యక్రమాలు కూడా నిర్వహించనున్నారు. దీనివల్ల నౌకల నిర్వహణ విధానాలు, సాంకేతిక పరిజ్ఞానం, సముద్ర కార్యకలాపాల అనుభవాలను తెలుసుకునే అవకాశం కలగనుంది. నౌకాదళాల మధ్య పరస్పర అవగాహన పెంపొందించడంతో పాటు భవిష్యత్తులో సంయుక్త కార్యకలాపాలకు అవసరమైన సమన్వయాన్ని అభివృద్ధి చేసుకోవడానికి ఈ కార్యక్రమాలు తోడ్పడనున్నాయి. వృత్తిపరమైన చర్చలు, పరస్పర సందర్శనలు ఈ పర్యటనలో కీలకంగా నిలవనున్నాయి.భారత రాయబార కార్యాలయం, గ్రీస్ నౌకాదళ అధికారుల సమన్వయంతో సాంస్కృతిక కార్యక్రమాలు కూడా నిర్వహించనున్నారు. ఇరు దేశాల నౌకాదళ సిబ్బంది మధ్య స్నేహపూర్వక సంబంధాలను పెంపొందించడం, సంప్రదాయాలు, సంస్కృతులను పరస్పరం తెలుసుకోవడం ఈ కార్యక్రమాల ప్రధాన ఉద్దేశం. అధికారిక సమావేశాలతో పాటు ఇలాంటి సాంస్కృతిక మార్పిడి కార్యక్రమాలు దేశాల మధ్య ప్రజా సంబంధాలను కూడా బలోపేతం చేస్తాయి. మధ్యధరా సముద్ర ప్రాంతంలో భారత నౌకాదళ ఉనికిని చాటడంతో పాటు మిత్రదేశాలతో సంబంధాలను విస్తరించేందుకు ఈ పర్యటన ప్రాధాన్యం సంతరించుకుంది.భారత్ తన సముద్ర ప్రయోజనాల పరిరక్షణతో పాటు అంతర్జాతీయ సముద్ర మార్గాల్లో శాంతి, భద్రతకు ప్రాధాన్యం ఇస్తోంది. ఈ నేపథ్యంలో మధ్యధరా సముద్రంలో ఐఎన్ఎస్ త్రిశూల్ పర్యటన వ్యూహాత్మకంగా ప్రాముఖ్యతను సంతరించుకుంది. గ్రీస్‌తో ఇప్పటికే కొనసాగుతున్న రక్షణ, దౌత్య సంబంధాలకు నౌకాదళ సహకారం మరింత బలాన్ని అందించనుంది. పరస్పర సందర్శనలు, వృత్తిపరమైన చర్చలు, సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా ఇరు దేశాల మధ్య విశ్వాసం పెరుగుతుందని రక్షణ వర్గాలు భావిస్తున్నాయి. భారత నౌకాదళం అంతర్జాతీయ స్థాయిలో తన భాగస్వామ్యాలను విస్తరిస్తూ సముద్ర భద్రతలో కీలక పాత్ర పోషించేందుకు ముందుకు సాగుతోంది.

పాట్నాలో భారీగా మద్యం పట్టివేత


మెదటి పేజీ తరువాయి


పాట్నా, నవంబర్ 1 (మనప్రజాప్రతినిధి): బిహార్ రాజధాని పాట్నాలో అక్రమ మద్యం వ్యాపారంపై నిషేధ విభాగం అధికారులు భారీ దాడులు నిర్వహించారు. ఎయిర్‌పోర్టు పోలీస్‌స్టేషన్ పరిధిలోని మహువాబాగ్ ప్రాంతంలో ఓ అద్దె గదిలో రహస్యంగా నిల్వ ఉంచిన భారీ మొత్తంలో మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. అధికారులకు అందిన సమాచారం మేరకు నిర్వహించిన తనిఖీల్లో 733 లీటర్లకు పైగా ఇంగ్లిష్ మద్యం బయటపడింది. మొత్తం 2,497 సీసాల్లో నిల్వ ఉంచిన మద్యాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన మద్యం విలువ బహిరంగ మార్కెట్‌లో సుమారు రూ.8.80 లక్షలు ఉంటుందని అంచనా వేశారు. నిషేధం అమల్లో ఉన్న రాష్ట్రంలో ఇంత పెద్ద మొత్తంలో మద్యం నిల్వ ఉంచడం స్థానికంగా కలకలం రేపింది. ఈ ఘటనకు సంబంధించి రంజన్ కుమార్ అనే వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. అద్దె గదిని అక్రమ మద్యం నిల్వ కేంద్రంగా ఉపయోగిస్తున్నట్లు ప్రాథమిక విచారణలో గుర్తించినట్లు సమాచారం. మద్యాన్ని ఎక్కడి నుంచి తీసుకొచ్చారు? ఎవరికి సరఫరా చేయాలని నిర్ణయించారు? ఈ అక్రమ వ్యాపారం వెనుక ఇంకా ఎవరైనా ఉన్నారా? అనే కోణాల్లో అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. పెద్ద మొత్తంలో మద్యం ఒకే చోట నిల్వ ఉంచడం వెనుక వ్యవస్థీకృత అక్రమ రవాణా ముఠా ప్రమేయం ఉండవచ్చని అనుమానిస్తున్నారు. నిందితుడి నుంచి మరిన్ని వివరాలు సేకరించే పనిలో పోలీసులు నిమగ్నమయ్యారు.విచారణ సందర్భంగా ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, హర్యానా రాష్ట్రాల నుంచి మద్యాన్ని తీసుకొచ్చినట్లు నిందితుడు వెల్లడించినట్లు సమాచారం. ఇతర రాష్ట్రాల నుంచి మద్యాన్ని రహస్యంగా తరలించి బిహార్‌లో విక్రయించేందుకు ప్రయత్నిస్తున్నట్లు అధికారులు అనుమానిస్తున్నారు. మద్యం రవాణాకు ఉపయోగించిన మార్గాలు, వాహనాలు, సరఫరా వ్యవస్థపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. వివిధ రాష్ట్రాల నుంచి మద్యం తీసుకొచ్చి స్థానికంగా పంపిణీ చేస్తున్న ముఠాల వివరాలను కూడా పరిశీలిస్తున్నారు. ఈ వ్యవహారంలో నిందితుడికి సహకరించిన వ్యక్తులను గుర్తించేందుకు దర్యాప్తు కొనసాగుతోంది.బిహార్‌లో మద్య నిషేధం అమల్లో ఉన్నప్పటికీ అక్రమ రవాణా, నిల్వ, విక్రయాల ఘటనలు అప్పుడప్పుడు వెలుగులోకి వస్తున్నాయి. నిషేధాన్ని ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నామని అధికారులు చెబుతున్నప్పటికీ అక్రమ వ్యాపారానికి పూర్తిస్థాయిలో అడ్డుకట్ట పడటం లేదు. ఇతర రాష్ట్రాల నుంచి మద్యాన్ని రహస్యంగా తరలించడం, అద్దె గదులు, గోదాముల్లో నిల్వ చేయడం వంటి పద్ధతులను అక్రమ వ్యాపారులు అనుసరిస్తున్నట్లు తాజా ఘటన సూచిస్తోంది. ఈ నేపథ్యంలో సరిహద్దు ప్రాంతాల్లో తనిఖీలు పెంచడంతో పాటు అనుమానాస్పద నిల్వ కేంద్రాలపై నిఘా అవసరమని భావిస్తున్నారు. మహువాబాగ్ ప్రాంతంలో పట్టుబడిన 2,497 మద్యం సీసాలు, 733 లీటర్లకు పైగా మద్యం స్వాధీనం కావడం అక్రమ వ్యాపారం విస్తృతిని మరోసారి బయటపెట్టింది. ఈ కేసులో నిందితుడి విచారణ ద్వారా మద్యం సరఫరా వెనుక ఉన్న వ్యక్తులు, నెట్‌వర్క్ వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశముంది. ఇతర రాష్ట్రాల నుంచి బిహార్‌కు మద్యం తరలిస్తున్న మార్గాలను గుర్తించి వాటిని నియంత్రించడంపై అధికారులు దృష్టి సారించారు. కేసుకు సంబంధించిన ఆధారాలను సేకరిస్తూ తదుపరి చర్యలకు సిద్ధమవుతున్నారు. అక్రమ మద్యం వ్యాపారంపై నిఘా మరింత పెంచాలని స్థానికంగా అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

క్యాన్సర్ చికిత్సలో చారిత్రక ముందడుగు


మెదటి పేజీ తరువాయి

రోగులకు అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ కేంద్రం అందుబాటులోకి వస్తే ఈశాన్య రాష్ట్రాల ప్రజలు అత్యాధునిక క్యాన్సర్ చికిత్స కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం గణనీయంగా తగ్గనుంది. గువహటిలోని లోక్ సేవా భవన్‌లో శనివారం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ సమక్షంలో ఈ ఒప్పందంపై సంతకాలు జరిగాయి. ఈ ప్రాజెక్టు ద్వారా అసోంతో పాటు అరుణాచల్ ప్రదేశ్, మేఘాలయ, మణిపూర్, నాగాలాండ్, త్రిపుర, మిజోరం రాష్ట్రాలకు చెందిన క్యాన్సర్ బాధితులకు కూడా ప్రయోజనం చేకూరనుంది. ప్రస్తుతం దేశంలో ఈ తరహా చికిత్స ప్రధానంగా ప్రైవేటు ఆసుపత్రుల్లోనే అందుబాటులో ఉండటంతో రోగులు భారీ మొత్తాలను ఖర్చు చేయాల్సి వస్తోంది. ఒక్కో చికిత్సకు సుమారు రూ.50 లక్షల వరకు వ్యయం అవుతున్న పరిస్థితి ఉంది. ఆర్థిక స్థోమత లేని కుటుంబాలు ఇలాంటి అత్యాధునిక వైద్యాన్ని పొందలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. ఈ పరిస్థితిని మార్చి ప్రభుత్వ ఆధ్వర్యంలోనే ఆధునిక చికిత్సను అందుబాటులోకి తీసుకురావాలనే ఉద్దేశంతో ఈ ప్రాజెక్టును చేపట్టినట్లు ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ వెల్లడించారు.ప్రోటాన్ కిరణ చికిత్స అనేది అత్యాధునిక రేడియేషన్ వైద్య విధానం. సాధారణంగా క్యాన్సర్ చికిత్సలో ఉపయోగించే ఎక్స్ కిరణాల స్థానంలో ప్రోటాన్ కణాలను వినియోగించి కణితులపై అత్యంత కచ్చితత్వంతో కిరణాలను ప్రసరింపజేస్తారు. ఈ విధానంలో క్యాన్సర్ కణితి వద్దనే అధిక మోతాదులో చికిత్సా శక్తిని కేంద్రీకరించే అవకాశం ఉండటంతో చుట్టుపక్కల ఉన్న ఆరోగ్యకరమైన కణజాలానికి కలిగే నష్టాన్ని తగ్గించవచ్చు. ముఖ్యంగా మెదడు, వెన్నెముక వంటి అత్యంత సున్నితమైన అవయవాలకు సమీపంలో ఏర్పడే కణితుల చికిత్సలో ఇది ఉపయోగకరంగా ఉంటుంది. చిన్నారుల్లో వచ్చే కొన్ని రకాల క్యాన్సర్లకు కూడా ఈ విధానం ప్రయోజనకరంగా పరిగణిస్తున్నారు. చికిత్స అనంతరం ఎదురయ్యే దుష్ప్రభావాలను తగ్గించడంలోనూ ఇది తోడ్పడే అవకాశం ఉంది. అయితే వ్యాధి స్వభావం, కణితి స్థానం, రోగి ఆరోగ్య పరిస్థితిని బట్టి వైద్యులు ఈ చికిత్సను సూచిస్తారు.ఈ భారీ ప్రాజెక్టుకు అవసరమైన రూ.600 కోట్ల నిధులను ప్రపంచ బ్యాంకు, అసోం ప్రభుత్వం సంయుక్తంగా సమకూర్చనున్నాయి. ఇందులో ప్రపంచ బ్యాంకు నుంచి రూ.315 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ.285 కోట్లు కేటాయించనున్నారు. ఒప్పందంలో భాగంగా అయాన్ బీమ్ అప్లికేషన్స్ సంస్థ అత్యాధునిక యంత్రాలను ఏర్పాటు చేయడంతో పాటు వైద్యులు, సాంకేతిక నిపుణులు, ఇతర సిబ్బందికి ప్రత్యేక శిక్షణ అందించనుంది. ప్రోటాన్ చికిత్స కేంద్రం నిర్వహణకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానం, వైద్య నైపుణ్యాలను స్థానిక సిబ్బందికి అందించడం ఈ ప్రాజెక్టులో కీలక అంశంగా ఉండనుంది. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా 17 క్యాన్సర్ ఆసుపత్రులను అభివృద్ధి చేస్తున్నామని, వాటిలో 12 ఆసుపత్రులు కార్యకలాపాలు ప్రారంభించాయని ముఖ్యమంత్రి తెలిపారు. ఈ నూతన కేంద్రాన్ని కూడా ఆ వైద్య వ్యవస్థతో అనుసంధానించడం ద్వారా క్యాన్సర్ నిర్ధారణ నుంచి అత్యాధునిక చికిత్స వరకు సమగ్ర వైద్యసేవలు అందించేందుకు ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తోంది.దేశంలో క్యాన్సర్ బాధితుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో అత్యాధునిక వైద్యాన్ని సామాన్యులకు చేరువ చేయడం అత్యంత కీలకంగా మారింది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలు, మారుమూల ప్రాంతాల్లో నివసించే రోగులకు మెరుగైన చికిత్స అందుబాటులో లేకపోవడం పెద్ద సమస్యగా కొనసాగుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వ రంగంలోనే ప్రోటాన్ కిరణ చికిత్స కేంద్రాన్ని ఏర్పాటు చేయాలన్న అసోం ప్రభుత్వ నిర్ణయం వైద్యరంగంలో కీలక పరిణామంగా భావిస్తున్నారు. ఈ కేంద్రం పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే ఈశాన్య భారతదేశంలో క్యాన్సర్ చికిత్సకు గువహటి ప్రధాన వైద్య కేంద్రంగా ఎదిగే అవకాశం ఉంది. అయితే ప్రాజెక్టు గడువులోగా పూర్తిచేయడం, చికిత్స ఖర్చును సామాన్యులకు అందుబాటులో ఉంచడం, నిపుణులైన వైద్య సిబ్బందిని అందుబాటులోకి తీసుకురావడం అత్యంత ముఖ్యం. ప్రభుత్వ లక్ష్యాలు కార్యరూపం దాలిస్తే వేలాది మంది క్యాన్సర్ బాధితులకు మెరుగైన వైద్యసేవలు పొందే అవకాశం కలగనుంది.

చౌటుప్పల్‌లో దారుణ హత్య


మెదటి పేజీ తరువాయి


ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన నిఘా కెమెరాల దృశ్యాలను పరిశీలించి నిందితుల కదలికలను గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నారు. దుండగులు ఎంతమంది వచ్చారు? వారు ఉపయోగించిన మార్గాలేమిటి? ఘటనకు ముందు, తర్వాత ఎవరైనా అనుమానాస్పదంగా కనిపించారా? అనే వివరాలను సేకరిస్తున్నారు.సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని కేసు నమోదు చేశారు. హత్య జరిగిన ఇంటిని పరిశీలించి క్లూస్ బృందం ద్వారా కీలక ఆధారాలను సేకరించారు. వేలిముద్రలు, ఇతర భౌతిక ఆధారాలను పరిశీలిస్తూ నిందితుల గుర్తింపునకు ప్రయత్నిస్తున్నారు. మృతదేహాన్ని పరిశీలించి హత్యకు సంబంధించిన వివరాలను సేకరించారు. ఘటన జరిగిన సమయం, దుండగులు ఇంట్లోకి ప్రవేశించిన తీరు, దోపిడీకి ఉపయోగించిన పద్ధతులపై దర్యాప్తు కొనసాగుతోంది. స్థానికులను విచారించడంతో పాటు అనుమానితుల వివరాలను కూడా సేకరిస్తున్నారు. నిందితులను త్వరగా గుర్తించేందుకు ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు చేపట్టే అవకాశముంది.చౌటుప్పల్‌లో జరిగిన ఈ హత్య, భారీ దోపిడీ ఘటన స్థానిక ప్రజలను ఉలిక్కిపడేలా చేసింది. ఒకే ఘటనలో ప్రాణం తీయడంతో పాటు బంగారం, నగదు, కారును అపహరించుకెళ్లడం వెనుక ఉన్న అసలు కారణాలను తెలుసుకోవడంపై పోలీసుల దర్యాప్తు కేంద్రీకృతమైంది. సుధాకర్‌కు తెలిసిన వ్యక్తుల ప్రమేయం ఉందా? దోపిడీ కోసమే దుండగులు ముందస్తు ప్రణాళికతో వచ్చారా? అనే అంశాలు విచారణలో తేలాల్సి ఉంది. ఘటనకు సంబంధించి అధికారికంగా వెల్లడయ్యే పూర్తి వివరాలపై స్థానికులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. నిందితులను గుర్తించి అరెస్టు చేసిన తర్వాతే హత్య వెనుక ఉద్దేశం, దోపిడీకి సంబంధించిన పూర్తి వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉంది.

నగరంలో నీటి సరఫరాకు అంతరాయం



హైదరాబాద్, నవంబర్ 1 (మనప్రజాప్రతినిధి): హైదరాబాద్ నగరవాసులకు జలమండలి కీలక హెచ్చరిక జారీ చేసింది. గండిపేట కాండ్యూట్‌లో ఏర్పడిన భారీ లీకేజీల మరమ్మతుల కారణంగా నగరంలోని పలు ప్రాంతాల్లో తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడనుంది. నవంబర్ 3వ తేదీ ఉదయం 6 గంటల నుంచి నవంబర్ 4వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు మొత్తం 36 గంటలపాటు మరమ్మతుల పనులు చేపట్టనున్నట్లు అధికారులు వెల్లడించారు. సబ్జా కాలనీ, టోలిచౌకి, మణికొండ ప్రాంతాల వద్ద కాండ్యూట్‌లో భారీగా లీకేజీలు ఏర్పడటంతో నీటి వృథాను అరికట్టేందుకు అత్యవసర మరమ్మతులు చేపట్టాలని నిర్ణయించారు. ఈ పనులు పూర్తయ్యే వరకు ప్రభావిత ప్రాంతాల్లో నీటి సరఫరా నిలిచిపోవడం లేదా ఒత్తిడి తగ్గే అవకాశం ఉందని జలమండలి స్పష్టం చేసింది. సంబంధిత ప్రాంతాల ప్రజలు ముందుగానే అప్రమత్తమై అవసరమైన నీటిని నిల్వ చేసుకోవాలని సూచించింది.గోషామహల్, కార్వాన్ సర్కిళ్ల పరిధిలోని పలు ప్రాంతాలపై ఈ మరమ్మతుల ప్రభావం ఉండనుంది. రెడ్‌హిల్స్, నాంపల్లి, మల్లేపల్లి, సీతారాంబాగ్, గోడేకీ ఖబర్, హిందీనగర్, అసెంబ్లీ, సచివాలయం, నూతన ఎమ్మెల్యే క్వార్టర్స్, ఆదర్శ్‌నగర్ ప్రాంతాల్లో తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడనుంది. అదేవిధంగా నాంపల్లిలోని దక్షిణ మధ్య రైల్వే ప్రాంతం, గన్‌ఫౌండ్రీ పరిసర ప్రాంతాల ప్రజలు కూడా ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉంది. ఈ ప్రాంతాల్లో నివసించే కుటుంబాలు తాగునీరు, వంట అవసరాలు, ఇతర రోజువారీ అవసరాలకు సరిపడా నీటిని ముందుగానే సమకూర్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ముఖ్యంగా అపార్ట్‌మెంట్లు, వాణిజ్య సముదాయాలు, ఆసుపత్రులు, విద్యాసంస్థలు నీటి వినియోగంపై ముందస్తు ప్రణాళిక రూపొందించుకోవాలని సూచిస్తున్నారు.గోల్కొండ జోన్ పరిధిలోని 14వ డివిజన్‌లోనూ నీటి సరఫరాకు ఆటంకం కలగనుంది. చింతల్ బస్తీ, విజయనగర్ కాలనీ, ఓల్డ్ మల్లేపల్లి, ఆసిఫ్‌నగర్, అహ్మద్‌నగర్ ప్రాంతాలు ప్రభావిత ప్రాంతాల జాబితాలో ఉన్నాయి. ఈ ప్రాంతాల్లోని నివాసితులు మరమ్మతుల సమయాన్ని దృష్టిలో ఉంచుకుని తాగునీటిని పొదుపుగా వినియోగించుకోవాల్సి ఉంటుంది. నీటి సరఫరా పునరుద్ధరణలో జాప్యం జరిగితే అదనపు ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉన్నందున ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం మంచిదని అధికారులు సూచిస్తున్నారు. అత్యవసర అవసరాలకు నీరు అందుబాటులో ఉండేలా గృహాలు, అపార్ట్‌మెంట్ల నిర్వాహకులు తగిన ఏర్పాట్లు చేసుకోవాల్సిన అవసరం ఉంది.కవాడిగూడ సర్కిల్ పరిధిలోని 17వ డివిజన్‌లో కవాడిగూడ, గాంధీనగర్ వార్డులకు చెందిన దోమలగూడ ప్రాంతంపై కూడా మరమ్మతుల ప్రభావం పడనుంది. జూబ్లీహిల్స్ సర్కిల్ పరిధిలోని 15వ డివిజన్ బంజారాహిల్స్ వార్డులోని ప్రాంతాల్లోనూ తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడనుంది. ఈ ప్రాంతాల్లో నివసించే ప్రజలు ముఖ్యంగా వృద్ధులు, చిన్నపిల్లలు, అనారోగ్యంతో ఉన్నవారి అవసరాలను దృష్టిలో ఉంచుకుని తగినంత నీటిని ముందుగానే నిల్వ చేసుకోవాలి. హోటళ్లు, చిన్న వ్యాపార సంస్థలు, కార్యాలయాలు కూడా తమ రోజువారీ కార్యకలాపాలకు అవసరమైన నీటి ఏర్పాట్లు చేసుకోవాల్సి ఉంటుంది. మరమ్మతుల సమయంలో నీటి వినియోగాన్ని తగ్గించి అందుబాటులో ఉన్న నిల్వలను జాగ్రత్తగా ఉపయోగించుకోవడం అవసరం.గండిపేట కాండ్యూట్‌లో ఏర్పడిన లీకేజీలను పూర్తిస్థాయిలో అరికట్టి నీటి సరఫరా వ్యవస్థను మరింత పటిష్ఠం చేయడమే ఈ మరమ్మతుల ప్రధాన ఉద్దేశమని జలమండలి అధికారులు వెల్లడించారు. అయితే 36 గంటలపాటు పనులు కొనసాగనున్న నేపథ్యంలో ప్రభావిత ప్రాంతాల ప్రజలు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం అత్యంత అవసరం. మరమ్మతులు పూర్తయిన అనంతరం నీటి సరఫరాను దశలవారీగా పునరుద్ధరించే అవకాశం ఉంది. సరఫరా ప్రారంభమైన వెంటనే అన్ని ప్రాంతాలకు సాధారణ స్థాయిలో నీరు చేరేందుకు కొంత సమయం పట్టవచ్చు. కాబట్టి నవంబర్ 3, 4 తేదీల్లో ఎదురయ్యే ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని నవంబర్ 2వ తేదీ నుంచే నీటిని నిల్వ చేసుకోవాలని ప్రజలకు సూచిస్తున్నారు. నీటి వృథాను నివారిస్తూ జలమండలి అధికారుల సూచనలను పాటించాలని కోరుతున్నారు.

ఘనంగా మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ జన్మదిన వేడుకలు



మెదక్ జిల్లా//మన ప్రజాప్రతినిధి:మెదక్ మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ జన్మదిన వేడుకలను పురస్కరించుకుని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తల సమక్షంలో కేక్ కట్ చేసి ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని, ప్రజలకు మరిన్ని సేవలు అందిస్తూ ఉన్నత స్థాయికి ఎదగాలని నాయకులు ఆకాంక్షించారు. అనంతరం కాంగ్రెస్ నాయకుడు బెండే రమేష్ ఆధ్వర్యంలో నిరుపేదలకు 500 దుప్పట్లు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే జన్మదినాన్ని పురస్కరించుకుని సేవా కార్యక్రమంలో భాగంగా దుప్పట్లు అందించడం పట్ల పలువురు అభినందించారు. దుప్పట్లు అందుకున్న నిరుపేదలు రోహిత్ బాబు చల్లగా ఉండాలని ఆశీర్వదించారు.ఈ కార్యక్రమంలో మెదక్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మార్గం నాగరాజు, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు యాదగిరి గౌడ్, మంభోజిపల్లి సర్పంచ్ మానస రాములు, ఉపసర్పంచ్ మహేష్ గౌడ్, వార్డు సభ్యుడు మేకల ఆంజనేయులు, జానకంపల్లి సర్పంచ్ నెల్లి నరసింహులు, ఉపసర్పంచ్ దివిటి వెంకటేశం, చిట్యాల సర్పంచ్ శైలజ రాజాగౌడ్, ఉపసర్పంచ్, మండల ఎస్సీ సెల్ చైర్మన్ బొమ్మర్ది ప్రభాకర్, గుట్టకిందపల్లి మాజీ సర్పంచ్ లక్ష్మణ్, శివాయిపల్లి కాస వెంకటేష్, మక్త భూపతిపూర్ గ్రామ కమిటీ అధ్యక్షుడు ఎం. శ్రీనివాస్, ర్యాలమడుగు మాజీ సర్పంచ్ బోయిని ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

చెత్త డంపింగ్ యార్డ్ తరలించేంతవరకు పోరాటం ఆగదన్న
ఎంపీ ఈటెల రాజేందర్ భారీ వర్షంలో బహిరంగ సభ



మన ప్రజా ప్రతినిధి తెలుగు దినపత్రిక మేడ్చల్:మేడ్చల్ జిల్లా మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ కీసర సర్కిల్ జవహర్ నగర్ లోని రామ్ కి చెత్త డంపింగ్ యార్డ్ తరలింపు పై బిజేపి తలపెట్టిన నాలుగు రోజులపాటు 60 కిలోమీటర్ల మేర పాదయాత్ర ముగింపు సందర్భంగా నిర్వహించిన భారీ బహిరంగ సభ విజయవంతం.భారీ జడి వానలోను ఆగని ఈటెల రాజేందర్ పాదయాత్ర ముగింపు బహిరంగ సభ.భారీగా తరలివచ్చిన ప్రజలు వేదికపై వర్షంలోనే ఎంపీ లు ఈటెల రాజేందర్, రఘునందన్ రావు, మహేశ్వర్ రెడ్డి, రాకేష్ రెడ్డితో పాటు మిగతా నేతలు.నేతలతో పాటు వర్షంలో తడుస్తూనే సభ అయిపోయే వరకు నిలబడి ఒక అడుగు కూడా జరగకుండా ప్రసంగాన్ని విన్న ప్రజలు.కార్యకర్తలు, ప్రజల కమిట్ మెంట్ చూసి నాయకులకు,నాయకుల కమిట్ మెంట్ చూసి ప్రజలకు,కార్యకర్తలకు ఫుల్ జోష్.జవహర్ నగర్ చెత్త డంపింగ్ యార్డ్ తరలించేంత వరకు బి.జే.పి పోరాటం ఆగదు అంటూ నేను మీ సమస్య పరిష్కరించేంతవరకు అండగా ఉంటానని ఎంపీ ఈటెల రాజేందర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.లక్షలాదీ మంది ప్రజల ప్రాణాల రక్షణ కోసం బిజెపి తలపెట్టిన డంపింగ్ యార్డ్ పై పోరాటానికి ఈటెల రాజేందర్ వెంట మేము నడుస్తాం –బిజెపి ఎంపీలు, ఎమ్మెల్యేలు. స్థానిక ప్రజలు.

తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి రాష్ట్ర కన్వీనర్ గా శాగంటి వెంకటేష్ నియామకం



మన ప్రజా ప్రతినిధి తెలుగు దినపత్రిక మేడ్చల్ :భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చి 79 ఏళ్లు పూర్తయినా రజకుల జీవితాల్లో ఆశించిన స్థాయిలో మార్పు రాలేదని,ఇందుకు పాలకుల నిర్లక్ష్యమే ప్రధాన కారణమని తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి రాష్ట్ర అధ్యక్షులు గోపి రజక, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొలిపాక లక్ష్మణ్,రాష్ట్ర ఉపాధ్యక్షులు సాంబరాజు కుమార్, ఆవేదన వ్యక్తం చేశారు.రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలనే అంశంపై ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి గతంలో అసెంబ్లీలో స్వయంగా ప్రస్తావించిన విషయాన్ని గోపి రజక గుర్తుచేశారు. 2016 డిసెంబర్ 26న కోడంగల్ ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలని ఆనాటి ప్రభుత్వాన్ని ప్రశ్నించిన రేవంత్ రెడ్డి, ప్రస్తుతం ముఖ్యమంత్రి హోదాలో ఉన్నప్పటికీ అదే అంశంపై ఎందుకు స్పందించడం లేదో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు.ఇందిరమ్మ బాటలో రజకులకు న్యాయం చేయాలి రాష్ట్ర కన్వీనర్ శాగంటి వెంకటేష్ మాట్లాడుతూ, 56/1984 ఆర్డినెన్స్ ద్వారా మాజీ ప్రధానమంత్రి ఇందిరాగాంధీ హయాంలో రజకులకు సంబంధించిన ఎస్సీ అంశంపై కీలక పరిణామాలు చోటుచేసుకున్నాయని తెలిపారు.అవగాహన లోపంతో కొన్ని రాష్ట్రాల్లో రజకులు ఓబీసీ వర్గంలోనే కొనసాగుతున్నారని పేర్కొన్నారు.ఇందిరాగాంధీ స్ఫూర్తితో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముందుకు వచ్చి రజకులను ఎస్సీ జాబితాలో చేర్చే అంశంపై తెలంగాణ అసెంబ్లీలో తీర్మానం చేసి,కేంద్ర ప్రభుత్వానికి పంపాలని కోరారు.కేంద్రంపై రాజకీయ, చట్టపరమైన ఒత్తిడి తీసుకువచ్చి రజకుల చిరకాల డిమాండ్‌ను నెరవేర్చేందుకు చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. రజకుల సామాజిక, ఆర్థిక, రాజకీయ అభివృద్ధికి ఎస్సీ హోదా ఎంతో కీలకమని, ఈ అంశాన్ని ప్రభుత్వం ఇకపై కూడా వాయిదా వేయకుండా తక్షణమే నిర్ణయం తీసుకోవాలని గోపి రజక డిమాండ్ చేశారు. మేడ్చల్ జిల్లా కమిటీ విస్తరణలో భాగంగా జిల్లా ఉపాధ్యక్షులుగా మైలారం ఉపేందర్, జిల్లా ముఖ్య సలహాదారులుగా చిట్యాల సత్తయ్య, కాప్రా మండల సంయుక్త కార్యదర్శిగా పూజారి రామన్న, నియమితులయ్యారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి రాష్ట్ర విద్యార్థి విభాగం అధ్యక్షులు బసవరాజ్, రాష్ట్ర మీడియా యూత్ సెక్రెటరీ రాపర్తి అజయ్, మేడ్చల్ జిల్లా యూత్ అధ్యక్షుడు పోలాస సాయి కుమార్, జిల్లా సంయుక్త కార్యదర్శి పోలాస అశోక్, కాప్రా మండల అధ్యక్షులు పోలస కిరణ్ కుమార్, ఉపాధ్యక్షులు ఓరుగంటి చంద్రమౌళి, సిహెచ్ సత్తయ్య, ఇ,రాజు, వడ్లకొండ దుర్గయ్య, శోభన్, ఎదునూరి రాజు, సింగారం నరసింహ, మైలారం ఎల్లమ్మ, నరసమ్మ, బుచ్చమ్మ, కోమల, లాస్య, రజక నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బిఆర్ఎస్ యూత్ అధ్యక్షుడిగా పొలాస అశోక్ కుమార్
నియామక పత్రం అందజేసిన ఎమ్మెల్యే మల్లారెడ్డి



మన ప్రజా ప్రతినిధి తెలుగు దినపత్రిక మేడ్చల్ :మేడ్చల్ మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ కీసర సర్కిల్ జవహర్ నగర్ డివిజన్-3 బిఆర్ఎస్ యూత్ అధ్యక్షుడిగా పొలాస అశోక్ కుమార్ నియమితులయ్యారు.మాజీ మంత్రి. ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఈ నియామకం జరిగింది. ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.కార్యక్రమంలో మాజీ మేయర్ మేకల కావ్య, పార్టీ డివిజన్ అధ్యక్షుడు కొండల్ ముదిరాజ్, మాజీ కార్పొరేటర్ పల్లపు రవి, నాయకులు సింగన్న బాలరాజ్, సిద్దులు, పొలాస సాయి కుమార్, బండి నవీన్, కృష్ణ యాదవ్, పల్లపు ప్రశాంత్, రాజు, అజీం,రవి పాల్గొన్నారు.మహిళా విభాగం నుంచి మల్లమ్మ, యాకమ్మ, యదాలక్ష్మి, కళావతి, లక్ష్మి, విమల, మహేశ్వరి,ధనలక్ష్మి హాజరయ్యారు.ఈ సందర్భంగా నూతనంగా యువజన సంఘం అధ్యక్షునిగా ఏకగ్రీవమైన పొలాస అశోక్ కుమార్ మాట్లాడుతూ తనకు అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తానని తెలిపారు. పార్టీ బలోపేతానికి, యువతను పార్టీ వైపు ఆకర్షించేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు.

రాంపూర్ గ్రామ బాధిత కుటుంబానికి రూ.5000 వేల రూపాయలు ఆర్థిక సాయం
అందించిన వంగ రాజేశ్వర్ రెడ్డి



మన ప్రజా ప్రతినిధి తెలుగు దినపత్రిక నవంబర్ 1 సిద్దిపేట :నంగునూరు మండలం రాంపూర్ గ్రామానికి చెందిన అక్కోజు ఈశ్వరయ్య మృతి చెందిన విషయం తెలుసుకున్న వంగ రాజేశ్వర్ రెడ్డి గారు మానవతా దృక్పథంతో స్పందించారు. ఈ సందర్భంగా మృతుని కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, కుటుంబానికి అండగా నిలిచేందుకు తక్షణ ఆర్థిక సహాయంగా రూ. 5,000 అందించారు.

పారిశుద్ధ్య కార్మికురాలి కుటుంబానికి ఆర్థిక సాయం అందించిన సర్పంచ్




మన ప్రజ ప్రతినిధి తెలుగు దిన పత్రిక మెదక్ జిల్లా చేగుంట, నవంబర్ 01: చేగుంట గ్రామపంచాయతీలో గత 30 సంవత్సరాలుగా సఫాయి కార్మికురాలిగా సేవలందించి శనివారం మృతి చెందిన సిరిగోజి పోచమ్మ భౌతికయానికి నివాళి అర్పించి అంత్యక్రియల నిమిత్తం చేగుంట సర్పంచ్ సంద్రుగు స్రవంతి సతీష్, ఉప సర్పంచ్ రఫీ, పంచాయతీ పాలకవర్గం ఆమె కుటుంబ సభ్యులకు పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు; వారు మాట్లాడుతూ.. దశాబ్దాల పాటు గ్రామ పరిశుభ్రత కోసం పోచమ్మ అందించిన సేవలు ఎనలేనివని కొనియాడారు; పంచాయతీలో విధులు నిర్వర్తించే సిబ్బందికి, కార్మికులకు ఎలాంటి ఆపద వచ్చినా పాలకవర్గం ఎల్లప్పుడూ ముందుండి అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు; పోచమ్మ మరణం పట్ల ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేస్తూ వారి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సంద్రుగు స్రవంతి సతీష్, ఉపసర్పంచ్ రఫీ, చేగుంట మహంకాళి ఆలయ కమిటీ చైర్మన్ సంద్రుగు సతీష్, వార్డు సభ్యులు తలారి నాగరాణి లింగం, కట్ట శివలక్ష్మి శ్రీనివాస్, షేక్ ఆరిఫ్, మాదాసు సరస్వతి, శశి, ఆకుల సుఖేందర్,, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

డంపింగ్ యార్డు శాశ్వత మూసివేతకై పార్టీలను, పదవులను పణంగా పెట్టి పోరాడాలి



మన ప్రజా ప్రతినిధి తెలుగు దినపత్రిక మేడ్చల్ :డాక్టర్ బీ.ఆర్.అంబేద్కర్ 123వ జ్ఞానమాల కార్యక్రమంలో బీజేపీ ఎం.పి. ఈటెల రాజేందర్, బీఆర్ఎస్ ఎమ్మెల్యే మల్లారెడ్డి, కాంగ్రెస్ వజ్రేష్ యాదవ్ లకు విజ్ఞప్తి చేసిన జవహర్ నగర్ డంపింగ్ యార్డు ఎత్తివేత పోరాటకమిటి చైర్మన్ షేక్ షావలి. భారత రాజ్యాంగ హక్కుల పరిరక్షణ కమిటీ మహంకాళి బిక్షు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమం. పాల్గొన్న వివిధ రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలకు చెందిన జేఏసి నేతలు.ఆకట్టుకున్న వెంకటాచారి,గజ్జెల రాంచదర్ పాట మాట.ప్రజల ప్రాణాలు, ఆరోగ్యం, వారి సంక్షేమం కంటే పార్టీలు, పదవులు ఎక్కువ కాదు అని, 1951లో స్త్రీల హక్కుల కోసం చట్టసభల్లో ప్రవేశపెట్టిన హిందూ కోడ్ బిల్లు ఆమోదం పొందకపోవడంతో తన న్యాయశాఖ మంత్రిపదవికే రాజీనామా చేసిన భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీ.ఆర్.అంబేద్కర్ ప్రదర్శించిన పోరాట స్ఫూర్తితో రాంకీ చెత్త డంపింగ్ యార్డు శాశ్వత తొలగింపుకై బీజేపీ ఎం.పి.ఈటేల రాజేందర్, బీఆర్ఎస్ ఎమ్మెల్యే మల్లారెడ్డి, అధికార కాంగ్రెస్ డిసిసి ప్రసిడెంట్ వజ్రేష్ యాదవ్ తమ పదవులను పణంగా పెట్టి ఐక్యంగా కలిసి పోరాడాలని డాక్టర్ అంబేద్కర్ 123వ జ్ఞాన మాల కార్యక్రమం సందర్భంగా జవహర్ నగర్ డంపింగ్ యార్డు ఎత్తివేత పోరాటకమిటి చైర్మన్ షేక్ షావలి విజ్ఞప్తి చేశారు. 2026, నవంబర్-1, ఆదివారం రోజు, కీసర సర్కిల్, జవహర్ నగర్ జీహెచ్ఎంసీ, బాలాజీనగర్ బస్టాండ్ సెంటర్ లో భారత రాజ్యాంగ పరిరక్షణ పోరాటకమిటి నిర్వాహకులు మహంకాళి బిక్షు ఆధ్వర్యంలో డంపింగ్ యార్డుకు వ్యతిరేకంగా చేపట్టిన అంబేద్కర్ జ్ఞానమాల కార్యక్రమంలో ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరై షేక్ షావలి ప్రసంగించారు. ఆనాడు అంబేద్కర్ తన పదవిని తృణప్రాయంగా అర్పించారు కాబట్టే స్త్రీలకు నేడు ఆస్తి, విడాకులు, దత్తత, గుడిలో ప్రవేశం లాంటి ఎన్నో ఆత్మగౌరవ హక్కులు సాధించి పెట్టారని గుర్తుచేశారు. డంపింగ్ యార్డు పరిసర ప్రాంతాల ప్రజల సంక్షేమం కొరకు పై ముగ్గురు తమ పదవులను త్యాగంచేసి, ముందుకు వస్తే, ప్రజలు బ్రహ్మరథం పట్టడమే కాకుండా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి పెంచవచ్చునని పేర్కొన్నారు. ఇప్పటికైన ప్రజా ప్రతినిధులు, డిసిసి కాంగ్రెస్ నాయకులు అఖిలపక్ష రాజకీయ వైరుధ్యాలు వీడి, ఎప్పుడు ఏకం కాగలుగుతారా? అని అటు దమ్మాయిగూడ జేఏసి, ఇటు జవహర్ నగర్ జేఏసి లతో పాటు నాలుగు మండలాలకు చెందిన 30 లక్షలమంది ప్రజలు ఎదురు చూస్తున్నారని వెల్లడించారు. డిపిఆర్-మూడువేల కోట్ల నిధుల పేరిట జరిగే రాజకీయ చదరంగంలో బాధిత ప్రజలను పావులుగా చేయడం బాధాకరం అని అన్నారు. పౌర సమాజం యొక్క గౌరవాన్ని, స్వతంత్రతను, జీవనాన్ని ఆర్టికల్ 21 ద్వారా రాజ్యాంగం ప్రజలకు ఇచ్చిందని, స్వచ్ఛమైన గాలి, ఆరోగ్యకరమైన పర్యావరణంలో బతికే హక్కును గుర్తించక పోవడం అంటే రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని సుప్రీం కోర్టే అనేక సందర్భాల్లో ఉద్ఘాటించిందని అన్నారు. అందుకే జవహర్ నగర్ డంపింగ్ యార్డును శాశ్వతంగా మూసివేసి, సైంటిఫిక్ క్యాపింగ్, బయో మైనింగ్ శుద్ధి ప్రక్రియను యుద్ధ ప్రాతిపదికన కొనసాగించాలనే ప్రజల ప్రజాస్వామిక, న్యాయమైన డిమాండ్ పరిష్కారానికి ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధకులైన ఈటేల, మల్లారెడ్డి, వజ్రేష్ గార్లు, విడిగా చేపట్టే విభజన కార్యక్రమాలు, ప్రకటనలు నష్టదాయకమని, ఐక్యంగా ఉద్యమిస్తే సాధ్యం కానిది ఏమిలేదనే నగ్న సత్యం తెలిసిన రాజకీయ విజ్ఞులు, ఇప్పటికైన ఆ దిశగా అడుగులు వేయాలని షేక్ షావలి సూచించారు. చివరలో ప్రజానాట్య మండలి వెంకటాచారి, తెలంగాణ ఉద్యమ కళాకారుడు గజ్జెల రాంచందర్ ప్రదర్శించిన డంపింగ్ యార్డు, మహానీయులపై పాట, మాట విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈపై కార్యక్రమంలో టిజేఎస్ బద్రగామి అంజినేయులు, సిపిఎం శివన్నారాయణ, పిఓడభ్ల్యూ జయసుధ, జవహర్ నగర్ ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ మహ్మద్ పాషామియా, పిఓడభ్ల్యూ(విముక్తి) గడిపే సునీత, తుమ్మారాణి, ఏఐటియుసి అంబాల ఎల్లయ్య, తెలంగాణ ఉద్యమ మహిళా విభాగం సన్వాల సుచరిత, డివైఎఫ్ఐ కె.బాలు, గడ్డంగిరి, శ్రావణ్ కుమార్ తదితరులు పాల్గొన్నవారిలో ఉన్నారు.

హత్యకు గురైన కుటుంబానికి అండగా నిలిచిన
మాజీ చైర్మన్ బక్కి వెంకటయ్య



మనప్రజాప్రతినిధి//అక్బర్ పేట భూంపల్లి:అక్బర్ పేట భూంపల్లి మండల్ సిద్దిపేట జిల్లా అక్బర్ పేట భూంపల్లి మండల పరిధిలో భూంపల్లి గ్రామంలో రేణుక భర్తకు దుబ్బాక ఐటీఐ కళాశాలలో ఔట్‌సోర్సింగ్ అటెండర్ ఉద్యోగం కల్పించడంలో చొరవ సిద్దిపేట జిల్లా, భూంపల్లి గ్రామానికి చెందిన కుంట రేణుక హత్యకు గురైన ఘటనను తీవ్రంగా పరిగణించిన తెలంగాణ రాష్ట్ర మాజీ ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ గౌరవ శ్రీ బక్కి వెంకటయ్య గారు, బాధిత కుటుంబానికి అండగా నిలిచి తన మానవతా దృక్పథాన్ని చాటుకున్నారు.కుంట రేణుక మృతి చెందడంతో ఆమె కుటుంబం తీవ్ర విషాదంలో మునిగిపోవడమే కాకుండా, ఇద్దరు చిన్నారుల భవిష్యత్తుపై ఆందోళన నెలకొంది. ఈ పరిస్థితిని అర్థం చేసుకున్న మాజీ చైర్మన్ బక్కి వెంకటయ్య గారు, బాధిత కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించి, చిన్నారుల భవిష్యత్తుకు అండగా నిలవాలనే ఉద్దేశంతో ప్రత్యేక చొరవ తీసుకున్నారుఈ క్రమంలో సిద్ధిపేట జిల్లా కలెక్టర్ కార్యాలయం ద్వారా సంబంధిత అధికారులతో సంప్రదింపులు జరిపి, కుంట రేణుక భర్తకు దుబ్బాక ఐటీఐ కళాశాలలో ఔట్‌సోర్సింగ్ విధానంలో అటెండర్ ఉద్యోగం లభించేలా సహకరించారు. ఈ ఉద్యోగం ద్వారా కుటుంబానికి జీవనోపాధి లభించడంతో పాటు, చిన్నారుల పోషణ, భవిష్యత్తుకు కొంత భరోసా కలిగే అవకాశం ఏర్పడింది.ఆపదలో ఉన్న కుటుంబానికి అండగా నిలిచి, బాధితుల సంక్షేమం పట్ల తనకున్న నిబద్ధతను మరోసారి చాటుకున్న మాజీ చైర్మన్ బక్కి వెంకటయ్య గారి చొరవ పట్ల బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. తమ కష్టకాలంలో ఆదుకుని, కుటుంబానికి జీవనాధారం కల్పించేందుకు సహకరించిన వెంకటయ్య కి జీవితాంతం రుణపడి ఉంటామని భావోద్వేగంతో పేర్కొన్నారు.బాధిత కుటుంబానికి అండగా నిలిచి, చిన్నారుల భవిష్యత్తుకు భరోసా కల్పించేందుకు బక్కి వెంకటయ్య చేసిన కృషి పలువురి ప్రశంసలు అందుకుంటోంది.ఈ సందర్భంలో చైర్మన్ వెంకటయ్య తో పాటు సిద్దిపేట జిల్లా ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ ప్రియాంక భూంపల్లి గ్రామ సర్పంచ్ జన్నారెడ్డి, ఇతరులు ఉన్నారు.

పేద ప్రజల అభ్యున్నతికి అహర్నిశలు కృషి చేస్తా..
యువనేత వంగ రాజేశ్వర్ రెడ్డి



మన ప్రజా ప్రతినిధి తెలుగు దినపత్రిక నవంబర్ 1 చిన్న కోడూరు.: పేద ప్రజల అభ్యున్నతి కోసం అహర్నిశలు కృషి చేస్తానని యువ నేత , వ్యాపారవేత్త వంగ రాజేశ్వర్ రెడ్డి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని రాముని పట్ల గ్రామంలో యాసరిని బాల లక్ష్మి ఇటీవల మృతి చెందారు. ఈ విషయాన్ని తెలుసుకున్న వంగ రాజేశ్వర్ రెడ్డి ఆ కుటుంబాన్ని పరామర్శించి ఐదు వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఆ కుటుంబాన్ని పరామర్శించిన ఓదార్చారి భరోసా కల్పించారు. ఆయన వెంట వి ఆర్ ఆర్ టీం సభ్యులు కుండె తిరుపతి, కుంభాల చంద్రశేఖర్, బొబ్బురు రాజేష్, మాజీ ఉపసర్పంచ్ బొల్లం కుమార్, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సిద్దిపేట పట్టణంలో ఎల్లారెడ్డి నగర్‌లో బాధిత కుటుంబానికి వంగ రాజేశ్వర్ రెడ్డి ఆర్థిక చేయూత



మన ప్రజాప్రతినిధి తెలుగు దినపత్రిక నవంబర్ 1 సిద్దిపేట :సిద్దిపేట పట్టణంలోని ఎల్లారెడ్డి నగర్‌కు చెందిన చల్ల ఎల్లారెడ్డి గారు మరణించిన విషయం తెలుసుకున్న వంగ రాజేశ్వర్ రెడ్డి గారు మానవతా దృక్పథంతో స్పందించారు. వెంటనే వారి నివాసానికి చేరుకుని మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.ఈ సందర్భంగా బాధిత కుటుంబానికి అండగా నిలుస్తూ తక్షణ ఆర్థిక సహాయంగా రూ.5,000 అందజేశారు. ఆపద సమయంలో బాధిత కుటుంబానికి అండగా నిలిచి, వారికి తన వంతు సహకారం అందించారు.

ఈతకు వెళ్లిన ఇద్దరు విద్యార్థుల ప్రాణాలను పాట్టన పెట్టుకున్న మల్కారం క్వారీ





మన ప్రజా ప్రతినిధి తెలుగు దినపత్రిక మేడ్చల్ :మేడ్చల్ జిల్లా జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మల్కారం చెరువు క్వారీలో విషాద ఘటన చోటుచేసుకుంది. నీటిలో మునిగి ఇద్దరు విద్యార్థులు మృతి చెందారు.యాప్రాల్ కు చెందిన నయాన్ (18), రోహిత్ (18) అనే ఇద్దరు 10వ తరగతి విద్యార్థులు తమ మరో ముగ్గురు స్నేహితులతో కలిసి ఆదివారం మల్కారం క్వారీకి వెళ్లారు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు నీటిలో జారిపడి గల్లంతయ్యారు సమాచారం అందుకున్న జవహర్ నగర్ పోలీసులు, డీఆర్ఎఫ్ బృందం సంఘటనా స్థలానికి చేరుకుని గాలింపు చేపట్టి మృతదేహాలను వెలికితీశారు.విద్యార్థుల మృతితో ఆ ప్రాంతంలో తీవ్ర విషాదం నెలకొంది.భవిష్యత్తు ఉన్న యువ విద్యార్థులు అర్ధాంతరంగా మృతి చెందడంతో కుటుంబ సభ్యుల తీవ్ర శోకసముద్రంలో మునిగారు



ఓటు బచావో- దేశ్ బచావో

పాలకవీడు(మన ప్రజా ప్రతినిధి దినపత్రిక) SIR ను వెంటనే రద్దు చేయాలని సిపిఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు ధూళిపాళ ధనుంజయ నాయుడు కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆదివారం సూర్యాపేట జిల్లా పాలకవీడు లో సిపిఐ నాయకులతో కలసి పాత్రికేయులతో మాట్లాడుతూ... ప్రజాస్వామ్య పరిరక్షణ,, ఓటు హక్కు ప్రాధాన్యత ఓటర్ల హక్కుల రక్షణ పై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉన్నదని ప్రతి పౌరుడి ఓటు హక్కు గౌరవించబడాలని ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు అత్యంత కీలకమైన హక్కు అని ఓటర్ల హక్కులను పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు ప్రతి ఓటు ఎంతో విలువైనదని ప్రతి ఓటు ప్రజాస్వామ్యానికి పునాది అని ఓటర్ల హక్కులను గౌరవిస్తూ ప్రజాస్వామ్య విలువలను కాపాడుతూ రాజ్యాంగ స్ఫూర్తిని పరిరక్షించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా మెలగాలని తమకు ఓటు వేయని మైనారిటీ వర్గాల ఓట్లను కమ్యూనిస్టుల ఓట్లను తొలగించడమే లక్ష్యంగా బిజెపి పార్టీ ముందు కొనసాగుతున్నదని నరేంద్ర మోడీ మరియు అమిత్ షాల కనుసన్న లలో కేంద్ర ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ మెలుగుతున్నారని ఇది ప్రజాస్వామ్యానికి అత్యంత ప్రమాదకరమని అన్నారు దేశవ్యాప్తంగా తొలగించబడిన 13 కోట్ల 41 లక్షల ఓటర్లు పునరుద్ధరించాలని 2023లో సెక్షన్ 16 ద్వారా ఎలక్షన్ కమిషన్ కు కల్పించిన ప్రత్యేక రక్షణ చట్టాన్ని రద్దు చేయాలని సర్ రద్దు పై అహింసా మార్గంలో పోరాడుతున్న విద్యార్థి మరియు యువతపై పెట్టిన అక్రమ కేసులను రద్దు చేయాలని భారత రాజ్యాంగాన్ని మరియు రాజ్యాంగబద్ధ స్వతంత్ర ప్రతిపత్తి గల సంస్థలను కాపాడుకుందాంఅని లౌకిక ప్రజాస్వామ్యాన్ని కాపాడుకుందాం అని ఆయన పిలుపునిచ్చారు ఆయన వెంట నేరేడుచర్ల మండల సిపిఐ కార్యదర్శి కత్తి శ్రీనివాసరెడ్డి, పాలకవీడు మండల కార్యదర్శి ముళ్ళ జానయ్య ఉన్నారు



రిటైర్డ్ పోలీసుల సంక్షేమానికి ప్రత్యేక కార్యాలయం

వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయ భవనానికి శంకుస్థాపన చేసిన ఎస్పీ నరసింహ

సూర్యాపేట: (మన ప్రజాప్రతినిధి దినపత్రిక)పోలీస్ శాఖలో ఎన్నో ఏళ్లపాటు సేవలందించి పదవీ విరమణ పొందిన అధికారులు, సిబ్బంది సమాజంలో గౌరవప్రదమైన స్థానంలో ఉండాలని జిల్లా ఎస్పీ నరసింహ అన్నారు.ఆదివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని కుడకుడ కోమటికుంట కు వెళ్లే మార్గంలో రిటైర్డ్ పోలీస్ ఆఫీసర్స్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయ భవన నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పదవీ విరమణ పొందినప్పటికీ పోలీసుల మధ్య ఉన్న అనుబంధం ఎప్పటికీ కొనసాగాలని, ఒకరికొకరు అండగా ఉంటూ సమస్యలను పరిష్కరించుకోవాలని ఆకాంక్షించారు. అసోసియేషన్ సభ్యుల సంక్షేమ కార్యక్రమాలకు తనవంతు సహకారం ఉంటుందని తెలిపారు.. విధి నిర్వహణలో ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటూ ప్రజలకు సేవలందించిన రిటైర్డ్ పోలీసుల సంక్షేమానికి వెల్ఫేర్ అసోసియేషన్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు.ఈ కార్యక్రమంలో రిటైర్డ్ పోలీస్ ఆఫీసర్స్ అసోసియేషన్ వ్యవస్థాపకులు కృష్ణారెడ్డి, అధ్యక్షులు దామోదర్ రెడ్డి, కార్యదర్శి పి. పుల్లయ్య, వైస్ ప్రెసిడెంట్ శంకర్ గౌడ్, జిల్లా పోలీస్ వైస్ ప్రెసిడెంట్ శంకర్ నాయక్, జనరల్ సెక్రటరీ వై. కిరణ్ తదితరులు పాల్గొన్నారు



రాష్ట్రస్థాయి సాంస్కృతిక పోటీల్లో డాక్టర్ గుంటి పిచ్చయ్యకు ప్రథమ బహుమతులు

మఠంపల్లి ఎస్ఐ ప్రవీణ్ కుమార్ చేతుల మీదుగా ఘన సన్మానం

మఠంపల్లి: (మన ప్రజా ప్రతినిధి దినపత్రిక)తెలంగాణ రాష్ట్ర విద్యుత్ సంస్థల ఆధ్వర్యంలో యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలోని లక్ష్మీనరసింహస్వామి ఫంక్షన్ హాల్‌లో అక్టోబర్ 26 నుంచి 28 వరకు నిర్వహించిన రాష్ట్రస్థాయి సాంస్కృతిక పోటీల్లో మఠంపల్లి మండల కేంద్రానికి చెందిన డాక్టర్ గుంటి పిచ్చయ్య ప్రతిభ చాటుకున్నారు. మాయల ఫకీరు ఏకపాత్రాభినయంతో పాటు డాక్టర్ బి. ఆర్. అంబేద్కర్ పాత్రలో అద్భుతంగా నటించి రాష్ట్రస్థాయి ప్రథమ బహుమతులను గెలుచుకున్నారు.ఈ సందర్భంగా ఆదివారం మఠంపల్లి మండల కేంద్రంలో ఎస్ఐ ప్రవీణ్ కుమార్ డాక్టర్ గుంటి పిచ్చయ్యను ఘనంగా సన్మానించి అభినందించారు. రాష్ట్రస్థాయి పోటీల్లో రెండు పాత్రల ద్వారా ప్రథమ బహుమతులు సాధించడం మఠంపల్లి మండలానికి గర్వకారణమని పేర్కొంటూ, కళారంగంలో ఆయన మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ ఆరుట్ల వెంకన్న, సూర్యాపేట జిల్లా కళాకారుల సంఘం ఉపాధ్యక్షులు భద్రం రాజు వెంకట రామారావు, సీనియర్ కళాకారులు, మఠంపల్లి మాజీ ఉపసర్పంచ్ జూల కిరణ్ యాదవ్, తెలంగాణ మలిదశ ఉద్యమకారుల సంఘం మఠంపల్లి మండల అధ్యక్షులు పోతబత్తిని శ్రీనివాస్, సీనియర్ కళాకారులు తాటిపాముల ఏడుకొండలు, తాతరాజు రామలింగయ్యతో పాటు పోలీస్ సిబ్బంది పాల్గొని డాక్టర్ గుంటి పిచ్చయ్యను అభినందించారు.



తాగునీటి పాదుపునకు కొత్త బాట

- హైదరాబాద్‌లో గ్రీన్ వాటర్ ట్యాంకర్ల సేవలు ప్రారంభం
- సచివాలయం వేదికగా ముఖ్యమంత్రి ఆదేశాల అమలుకు శ్రీకారం
- తొలివిడతలో 19 శుద్ధి కేంద్రాల నుంచి సరఫరా
- 100 ట్యాంకర్ల నమోదు.. నగరవ్యాప్తంగా విస్తరణకు ప్రణాళిక


హైదరాబాద్, నవంబర్ 1 (మనప్రజాప్రతినిధి): హైదరాబాద్ మహానగరంలో తాగునీటి సంరక్షణ, భూగర్భ జలాల పరిరక్షణ దిశగా జలమండలి మరో కీలక అడుగు వేసింది. శుద్ధి చేసిన మురుగునీటిని తాగునీటికి ప్రత్యామ్నాయంగా కాకుండా ఇతర అవసరాలకు వినియోగించే లక్ష్యంతో చేపట్టిన గ్రీన్ వాటర్ ట్యాంకర్ల సేవలు ఆదివారం తెలంగాణ సచివాలయం వేదికగా ప్రారంభమయ్యాయి. జలమండలి 37వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు నగరంలో తాగునీటి వినియోగాన్ని తగ్గించి, అందుబాటులో ఉన్న నీటి వనరులను సమర్థంగా వినియోగించుకునేలా ఈ కార్యక్రమాన్ని రూపొందించారు. ముఖ్యంగా నిర్మాణ రంగం, తోటల పెంపకం, ఉద్యానవనాల నిర్వహణ, పార్కుల సంరక్షణ వంటి అవసరాలకు శుద్ధి చేసిన నీటిని సరఫరా చేయనున్నారు. దీనివల్ల విలువైన తాగునీటిని ఇతర అవసరాలకు వృథా చేయకుండా కాపాడుకోవచ్చని అధికారులు భావిస్తున్నారు.జలమండలి ఎండీ అశోక్ రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు శుద్ధి చేసిన మురుగునీటి పునర్వినియోగానికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ శాఖలు, ఉద్యానవనాలు, పార్కులు, పచ్చదనం నిర్వహణకు అవసరమైన నీటిని తొలుత గ్రీన్ వాటర్ ద్వారా అందించనున్నట్లు వెల్లడించారు. నగరంలో పెరుగుతున్న జనాభా, విస్తరిస్తున్న నిర్మాణాలు, పారిశ్రామిక అవసరాల నేపథ్యంలో తాగునీటిపై ఒత్తిడి పెరుగుతోందని, ఈ పరిస్థితుల్లో శుద్ధి చేసిన నీటిని ప్రత్యామ్నాయ అవసరాలకు వినియోగించడం ఎంతో అవసరమని పేర్కొన్నారు. ఎండాకాలంలో నీటి కొరత తీవ్రతను తగ్గించడంతో పాటు భూగర్భ జలాలపై ఆధారపడటాన్ని నియంత్రించేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని వివరించారు. నీటి సంరక్షణ ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని, ప్రజలు, ప్రభుత్వ సంస్థలు, ప్రైవేటు రంగం కూడా ఇందులో భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు.తొలివిడతలో నగరంలోని 19 మురుగునీటి శుద్ధి కేంద్రాల నుంచి 28 ప్రత్యేక గ్రీన్ వాటర్ ట్యాంకర్ల ద్వారా శుద్ధి చేసిన నీటిని సరఫరా చేయనున్నారు. అత్తాపూర్, అంబర్‌పేట్, నాగోల్, కోకాపేట్, గోపన్‌పల్లి, మియాపూర్ తదితర ప్రాంతాల్లో ఈ సేవలను అందుబాటులోకి తీసుకురానున్నారు. అవసరాలకు అనుగుణంగా మరిన్ని ప్రాంతాలకు దశలవారీగా విస్తరించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఈ నీటిని నిర్మాణ పనులు, రోడ్ల నిర్వహణ, మొక్కలకు నీరు పోయడం, పార్కుల అభివృద్ధి వంటి తాగునీరు అవసరం లేని పనులకు వినియోగించుకోవచ్చు. దీనివల్ల ఒకవైపు శుద్ధి చేసిన మురుగునీటికి సమర్థవంతమైన వినియోగం లభించడంతో పాటు మరోవైపు తాగునీటి వనరులపై ఒత్తిడి తగ్గుతుంది. నగర అవసరాలకు అనుగుణంగా సరఫరా వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని జలమండలి భావిస్తోంది.గ్రీన్ వాటర్ సరఫరా వ్యవస్థలో భాగంగా జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏతో పాటు ప్రైవేటు సంస్థలకు చెందిన సుమారు 100 ట్యాంకర్లు ఇప్పటికే నమోదు చేసుకున్నాయి. ఈ ట్యాంకర్లకు ప్రత్యేక గుర్తింపుతో కూడిన రంగులు, ప్రచార చిత్రాలను ఏర్పాటు చేయనున్నారు. సరఫరాలో పారదర్శకత కోసం జీపీఎస్ ఆధారిత పర్యవేక్షణ, ఎలక్ట్రానిక్ చెల్లింపుల వ్యవస్థ, ముందస్తు నమోదు విధానాలను అమలు చేయనున్నారు. ట్యాంకర్ల రాకపోకలు, నీటి సరఫరా వివరాలను పర్యవేక్షించడం ద్వారా అక్రమ వినియోగానికి అడ్డుకట్ట వేయాలని అధికారులు భావిస్తున్నారు. ముఖ్యంగా ఈ నీరు తాగడానికి పనికిరాదనే హెచ్చరికను ప్రతి ట్యాంకర్‌పై స్పష్టంగా ప్రదర్శించనున్నారు. ప్రజలు పొరపాటున ఈ నీటిని తాగునీటిగా వినియోగించకుండా తగిన జాగ్రత్తలు తీసుకోనున్నారు. వినియోగదారులకు సులభంగా నీరు అందేలా నమోదు, సరఫరా విధానాలను అందుబాటులోకి తీసుకురానున్నారు.రాబోయే రోజుల్లో ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తగ్గే పరిస్థితులు ఏర్పడే అవకాశాలున్న నేపథ్యంలో తాగునీటి, భూగర్భ జలాల సంరక్షణకు ఇప్పటి నుంచే చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని జలమండలి అధికారులు అభిప్రాయపడుతున్నారు. ఈ నేపథ్యంలో శుద్ధి చేసిన నీటిని విస్తృతంగా వినియోగించుకోవడం ద్వారా భవిష్యత్తులో ఎదురయ్యే నీటి సమస్యలను కొంతవరకు అధిగమించవచ్చని పేర్కొంటున్నారు. ఒకప్పుడు 167 చదరపు కిలోమీటర్ల పరిధిలో సేవలందించిన జలమండలి ప్రస్తుతం 2,053 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణానికి తన సేవలను విస్తరించింది. నగర విస్తరణకు అనుగుణంగా నీటి సరఫరా, మురుగునీటి శుద్ధి, పునర్వినియోగ వ్యవస్థలను అభివృద్ధి చేయడం కీలకంగా మారింది. జలమండలి 37వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఉద్యోగులకు శుభాకాంక్షలు తెలిపిన ఎండీ అశోక్ రెడ్డి, భవిష్యత్తులోనూ సుస్థిర నీటి నిర్వహణకు ప్రాధాన్యం ఇస్తామని స్పష్టం చేశారు. గ్రీన్ వాటర్ ట్యాంకర్ల కార్యక్రమం విజయవంతమైతే హైదరాబాద్‌లో నీటి సంరక్షణకు కొత్త దిశ ఏర్పడనుంది.



వివాహ నిశ్చితార్థ వేడుకకు హాజరైన గవ్వ వంశీధర్ రెడ్డి

మన ప్రజా ప్రతినిధి తెలుగు దినపత్రిక నవంబర్ 1 చిన్న కోడూరు:కోహెడ మండలం గొట్లమిట్ల గ్రామానికి చెందిన రెడ్డి సంఘం నాయకులు వట్టిపల్లి లావణ్య – రాజిరెడ్డి గార్ల కూతురు భవిత రెడ్డి– సందీప్ రెడ్డి ల వివాహా నిశ్చితార్థ వేడుక సిద్దిపేట జిల్లా కేంద్రంలోని వయోల గార్డెన్లో జరగగా వేడుకకు హాజరై కాబోయే నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేసిన బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు గవ్వ వంశీధర్ రెడ్డి గారు వారి వెంట కోహెడ మాజీ ఏఎంసి వైస్ చైర్మన్ సంధి శ్రీనివాసరెడ్డి వలస సుభాష్, రెడ్డి సంఘం సిద్దిపేట జిల్లా యూత్ అధ్యక్షుడు నరెడ్ల శ్రీనివాస్ రెడ్డి పూసల రాజశేఖర్ తదితరులు ఉన్నారు.





మ్యాథ్స్ అతిథి అధ్యాపక పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం"

మన ప్రజాప్రతినిధి తెలుగు దినపత్రిక నవంబర్ 1 చిన్న కోడూరు: చిన్నకోడూరు మండల పరిధి ఇబ్రహీం నగర్ గ్రామంలోని పి.ఎం.శ్రీ తెలంగాణ మోడల్ స్కూల్లో గంటల ప్రాతిపదికన (అతిథి అధ్యాపకులు) బోధించుటకు మ్యాథ్స్ ఉపాధ్యాయ నియామకానికి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపల్ పి. సతీష్ కుమార్ తెలియజేశారు. ఈ సందర్భంగా పి.జి.టి – మ్యాథ్స్ బోధించుటకు ఎం.ఎస్.సి మ్యాథ్స్, బీ.ఈడీ మరియు టెట్ అర్హతతో... అనుభవం కలిగిన అభ్యర్థులు ఈనెల04 /11 /2026 తేదీన పూర్తి బయోడేటా తో ఇబ్రహీం నగర్ మోడల్ స్కూల్లో నిర్వహించే డెమో మరియు ధ్రువ పత్రాల పరిశీలనకు హాజరుకావాలని కోరారు.

